# ఆచార్యుడు – అంతేవాసి

ఆచార్యుడనగా గురువు. అంతేవాసికి శిష్యుడని యర్థము. యజుర్వేదమునందు, తైత్తిరీయోపనిషత్తులో శిక్షావల్లి అని ఒక భాగమున్నది.అందు గురుశిష్య సంబంధమును గూర్చి నాలుగు వాక్యములున్నవి. అందు మొదటి రెండు వాక్యములు – "ఆచార్యః పూర్వ రూపం, అంతే వాస్యుత్తర రూపం" అని. మొదట గురువు. ఆ గురువు కొరకు వచ్చిన శిష్యుడు తరువాత. వేదమునందలి అనేక వాక్యములవలెనే, ఇవియును సామాన్యముగా తోచును. కాని మహార్థవంత ములు కాని వాక్యములు వేదమునందుండవు గదా!

1985 వ సంవత్సరమున, లండన్‌హీత్రో విమానాశ్రయమునందు బ్రిటిష్ ఎయిర్ వేస్ వారి బోయింగు విమానము దిగవలసిన దారిదాటి,బయట నున్న మైదానములో పడి ముక్కలై మండిపోయినది. అందులోని మూడు వందలమంది ప్రయాణీకులు, కర్మచారులు మరణించిరి. ఇంజను ఉన్న ముందరి భాగము విరిగినప్పుడు, ఆ ముందు సీట్లలో నున్న జాన్సన్ అన్న అమెరికా వాసి, కూర్చున్న ఆసనమునుండి విడివడి, కొంచెము దూరములోనున్న గుట్టకటువైపు పోయిపడెను. ఒకటి పడినది గడ్డిమీద. రెండు, కొంచెమెత్తుగానున్న గుట్ట, ఆయనకు లేచిన మంటల బారి నుండి రక్షణనిచ్చెను. మూడువందలమంది మృతులయి,విమానము పూర్తిగా దగ్ధమయి, ఒక్క జాన్సన్ చిన్న దెబ్బ లతో బ్రతికిబయటపడినాడు. ఆ రోజున లండన్‌లోని పత్రికలన్నియు ఈ ఆశ్చర్యకరమైన వార్తను విపులముగా వర్ణిం చుచు ప్రకటించినవి. ఈ సంఘటన, జాన్సనులో, మృత్యు స్వరూపమవగాహనము జేసుకొనవలెనన్న తీవ్రేచ్ఛ కల్పించినది. ఆయన చాలా ధనవంతుడు. టిబెట్టులో బౌద్ధాచార్యులున్నారు. వారివద్ద ఉపదేశము పొందవలెనని టిబెట్టు చేరినాడు. ఇప్పుడాయన బౌద్ధ సన్యాసి.

బొంబాయి నగరములో నానాచౌక్ అని ఒక పేట ఉన్నది. బొంబాయి నగరమే జనసంకీర్ణమైన ఊరు. అందులో నానాచౌక్ చెప్పనక్కర లేదు. సందులలో మేడమీద మేడ. మనిషిమీద మనిషి ఆ ఇరుకు సందులలో గౌడీయ మఠమున్నది. నేనెరిగిన ముగ్గురు స్నేహితులు ఒకరోజున, ఆ సందులలో గౌడీయ మఠమున్నదని వినుటయే గాని, ఎప్పుడును చూడలేదని, ప్రక్కల నడచుచున్న జనముల త్రోసికొనుచు లోనికి పోయినారు. ఆ ముగ్గురును గవర్న మెంటు ఉద్యోగులు. ఆ ముగ్గురిలో చిన్నవాడు ఐ.ఎ.యస్. పరీక్షలో ఉత్తీర్ణుడై బొంబాయి సెక్రటేరియట్‌లో పనిచేయు చున్నాడు. ఆయనకు ప్రమోషన్ వచ్చి ఢిల్లీకి పెద్ద ఉద్యోగిగా పోవలసిన సమయము. ఢిల్లీకి పోవుటకు ముందు వారము రోజుల సెలవలోనున్నాడు. ఆ మఠముగూడ, భారత దేశములోని తక్కిన గౌడీయ మఠముల వంటిదే. లోన నిలువెత్తు కృష్ణ విగ్రహము. సన్యాసులు దేవనమస్కారమయిన తరువాత, కృష్ణకపూర్, "మీరింటికి పొండు, నేను తరు వాత వత్తు" ననెను. సరే అని తక్కిన ఇద్దరింటికి చేరిరి. ఆ కృష్ణకపూర్ తిరిగి యింటికి రాలేదు. ఢిల్లీకి పోయి పెద్ద ఉద్యోగములో చేరలేదు. గౌడీయ మఠవాసి అయ్యెను.

ఈ కాలములో, ప్రపంచములోని అన్ని దేశములందును తిరుగుచు వేదాంత ప్రబోధ, ప్రచారములు చేయు చున్న స్వామి చిన్మయానంద, పూర్వాశ్రమములో పత్రికా విలేఖరి (జర్నలిష్టు). అవి హరిద్వారము వద్ద హృషికేశము నందు, స్వామి శివానంద, ఆశ్రమము స్థాపించి, యోగ వేదాంతములను బోధజేయు క్రొత్తరోజులు. ఈ స్వాములందరు వేదాంతము, మతములన్న ముసుగులలోనున్న ధన, కీర్తి కాలములన్న ధృఢ నిశ్చయముతో, వారి బండారమును, తన వ్యాసముల ద్వారా బయటపడవేయవలెనని, ఈ విలేఖరి, శివానందాశ్రమము జేరెను. ఏ పత్రికలో ఆ వ్యాసములు ప్రకటింపనుద్దేశించిరో, ఆ పత్రికకు ఎదురు చూచుచున్న వ్యాసములు రాలేదు. ఆ విలేఖరియు తిరిగి రాలేదు. ఆయన హిమవత్పర్వత ప్రాంత యతీశ్వరుడయ్యెను. ఎంత తీవ్రయతి అయ్యెననగా, క్రొత్తలో చిన్మయానందస్వామి పాదము లకు చెప్పులు లేకుండా, ఆ శిలాపథములందు బొబ్బలెక్కిన కాళ్ళతో నడిచెడివాడు.

నేనెరిగిన ఒక విద్యార్థి, తోడి కళాశాల విద్యార్థులతో కలసి, అజంతా గుహలను జూచుటకు వచ్చి, ఆ చిత్రము లకు మోహితుడై, ప్రక్కనున్న కుగ్రామమునందు రెండు సంవత్సరములుండి, బొమ్మలు గీయుట నభ్యాసము చేసెను. ఇప్పుడాయన వంగదేశమలో పేరెన్నికగన్న చిత్రకారులలో నొకడు. ఆయన, నీకు గురువెవరని అడిగినచో, అజంతా గుహలనెడివాడు.

ఈ విధముగా ఒక సంఘటన, ఒకసంస్థ, ఒక ప్రదేశము ఏదైనను మనలో నున్న జ్ఞానపిపాసను బయటకు తేవ చ్చును. జ్ఞానోపదేశము కలిగింపవచ్చును. ఏదైనను ఆచార్య రూపములో ప్రత్యక్షము కావచ్చును.

జన్మనెత్తిన ప్రతి మానవుడును, ఎప్పుడో ఒకప్పుడు శిష్య రూపమును దాల్చును గదా! ఆ నేర్చెడు విద్య స్థూల శరీరావసరమయిన జీవనోపాధి కావచ్చును. సూక్ష్మశరీరమందు ప్రధానమై, మనస్సున కానందమిచ్చు లలిత కళాభ్యాసము కావచ్చును. లేదా బ్రహ్మజ్ఞాన సంపాదనార్థము కావచ్చును. ఈ సూల, సూక్ష్మ, జ్ఞాన, దేహ గురువులు కరచరణాద్యవయవములతోడి మానవులైన కావచ్చును. కాకపోవచ్చును.

ఈ మూడిటికన్న ప్రధానమై, పుట్టిన క్షణమునుండి అవసరమైన మరియొక జ్ఞానమున్నది. అది స్వప్రాణ రక్షణ జ్ఞానము. మానవులే కాదు, పశువులే కాదు, క్రిమి కీటకాదులేకాదు, ప్రతి ప్రాణియు పుట్టుక నుండి నేర్చుకొనుచున్నది. లేడిపిల్ల, ప్రక్కన ఉన్న గుంపు ఆపదనుండి తప్పించుకొనుటకు పరుగిడుచుండగా, తానును పరుగిడుచున్నది. పులి పిల్ల పొదలోనికి దూరుచున్నది. ఈ నిజప్రాణ రక్షాజ్ఞానమునకు గురువెవరు? చుట్టునున్న తోడి ప్రాణులు. తానున్న వాతావరణము. నదీతీరమున పెరుగు మొక్కను కొనిపోయి ఎడారిలో పెంచుము. బ్రతుకుట కష్టము. కాని అనేకోపాయముల చేతనెట్లైన బ్రతికించుము. క్రమముగా దానియాకులు చిన్నవై, లోని చెమ్మను ఆవిరిగా మారకుండ రక్షణ నేర్పాటు చేసుకొనును. ఆ చెట్టునకా జ్ఞానమెవరు బోధించిరి? పైన ఉన్న సూర్యరశ్మి, పూర్వమున్న చరాచర మంతయు, ఆవిర్భవించిన ప్రాణికి జ్ఞానదాయకముగా భాసించుచున్నది.

మనకు సంపూర్ణముగ తెలియుట కొరకు, వేదమీ సృష్టిని అనేక దృక్పథములనుండి వర్ణించి వివరించును. విద్యాదృష్టితో జూచినచో ఆచార్య – అంతేవాసి రూపమయినదీ ప్రపంచము. ఈ గురుశిష్య పరంపరయందు వెనుకకు పోయినచో (చెట్టుముందా? విత్తుముందా? అన్నప్రశ్నకు వలెనే) సృష్ట్యారంభవేళ, ఆచార్యుడుండెనని వేదము చెప్పుచున్నది. పూర్వమనగా సృష్టికి పూర్వమని. ఈ బ్రహ్మాండమందునున్నసర్వజ్ఞానము, ఈ బ్రహ్మాండోత్పత్తికి కావలసిన సర్వజ్ఞానము తోడ, ఆచార్య రూపుడైన పరమేశ్వరుడీ సృష్టికి పూర్వుడని వేదవాక్య భావము. జ్ఞానహీనముగా నేకార్యమును జరుగదు కదా!

ఇప్పుడా "పూర్వ" శబ్దభావమవగాహన మగుచున్నది. పూర్వమనగా జననమునకు పూర్వమని యర్థము. ఎవరి జననమునకు? ఎవరికి వారి జననమునకు పూర్వము. కావున, ఈ చరాచరమంతయు, మనము పుట్టుటకు పూర్వమే, ఆచార్య రూపముతోడ నచ్చటనున్నది. ఈ చరాచరమంతయు గురుస్థానమైనచో, నోరు లేని చెట్లు ఏమి బోధించును? సిద్ధార్థ గౌతమునకు, ఆ వృద్ధుడును, రోగియు నేమి బోధించిరి? వారు శాస్త్రజ్ఞులా? వేద పండితులా? అశోకచక్రవర్తితో కళింగ భూమిలో మృతులైన సైనికులు, కాలు చేతులు విరిగిన భటులు మాటాడిరా?మనచుట్టునున్న పాంచభౌతిక ప్రపంచమంతయును, పరమేశ్వర కృతమగుటవలన, ఆ పరమేశ్వర స్వరూపము జ్ఞాన సంపుటి అగుట వలన,ఈ లోక మంతయు ఆ జ్ఞానముతోడ నిండియుండును. మనయందెప్పుడు శిష్యభావమావహించునో, అప్పుడు ఎదురుగా నున్న చేతనా–చేతనములందు జ్ఞానము భాసించును. అందువలన మనము శిష్యరూపము దాల్చినపుడు, ఈ ప్రపంచమంతయు ఆచార్యరూపమున, సంసిద్ధమై యుండునని వేదవాక్కు.

శిక్షావల్లిలోని తరువాత రెండు వాక్యాలు – విద్యా సంధిః ప్రవచనగ్ం సంథానం – అని గురువు, శిష్యుల మధ్య నున్న సంబంధము విద్య. అనగా జ్ఞానము. పూర్వుడైన ఆచార్యుని వద్దనుండి శిష్యుని జేరి, ఆ శిష్యుడాచార్యుడైనపుడు, తరువాత వచ్చిన శిష్యుని జేరుచు, సంతతచలనము తోడ విశ్వమంతయు వ్యాపించియున్న ఈ "జ్ఞానము" నిత్యమై భాసించుచున్నది.

చివరి వాక్యము ప్రవచనము సంధానమని. సంధానమనగా సంధిని, సంబంధమును కలుగజేయునది. విద్యను (జ్ఞానమును) ఆచార్యునినుండి శిష్యునకు జేర్చునది. ఆ సంబంధమును కల్పించునది ప్రవచనము. ప్రవచనమనగా, విస్పష్టముగా, శ్రేష్ఠముగా చెప్పినది. గురువృత్తికి అనువైన అర్థము. ప్రవచనమనగా శబ్దమని కూడ అర్థము. శబ్దమనగా వినిపించెడిది. మనలో నైక్యమయ్యెడిది. శిష్యపరమైన అర్థము. అనగా శబ్దము వలన జ్ఞానము గురువునుండి శిష్యుని జేరును. శబ్దమనగనే సాహిత్యమందలి అక్షరసముదాయమైన శబ్దమేకాక, ధ్వనియన్న అర్థముకూడ నున్నది కదా! ఈ ధ్వని తరంగములు భౌతిక శాస్త్రమందే, (physics) అనేక విధములు. మన చెవులకు వినపడు ధ్వని,వినపడని ధ్వని, (ultra sonic sound), రేడియో వినునపుడు పాటల మధ్య బురబురలాడు మ్రోత; (Visual Noise), టెలివిజన్ బొమ్మ చూచునపుడు కనపడు పిచ్చిగీతలు కూడ ధ్వని తరంగములే. ఈ శబ్దము, దానితో మన అవగాహనా శక్తికి (sound and artificial intellegence) ఉన్న సంబంధమును గూర్చి, ఈ రోజులలో తీవ్రముగ పరిశోధన

జరుగుచున్నది. ఒక్క మనమెరిగిన లోకమందే, శబ్దమింత విశాల వైవిధ్యములతో నుండగా, ఆధ్యాత్మ ప్రపంచము నందు (మన దేహములందు) జ్యోతిర్లోకములందు (నక్షత్రములు, గ్రహములు, జ్యోతిర్గోళములు, వాటి మధ్యనున్న అంతరిక్షమందు) ఉన్న శబ్దమును గూర్చి, ఎంత ఉండునో అని యిప్పుడిప్పుడే పరిశోధనల నారంభించినారు. వేదమే మనుచున్నదనగా, ఈ అనంతమైన విశ్వమునందు, ఏ ఒక "వస్తువు" నుండి గానిమ్ము (ఒక మనుష్యుడే కాదు), మరి యొక "వస్తువు"నకు "జ్ఞానము", "శబ్దము" ద్వారా ప్రయాణము సేయుచున్నదనుచున్నది. తాత్పర్యమేమనగా, "ప్రవచనము" అన్ని లోకములందును, అన్ని విధములైన గురు శిష్యులకును "జ్ఞాన" సంధానకమగుచున్నది. ఈ వేద వాక్యార్థమెవరికి వారాలోచించు కొనవలసిన విషయము. ఆలోచించిన కొలది విశదమయ్యెడి విషయము.

ఇప్పుడు అంతేవాసియన్న శబ్దము పరిశీలింతము. అంతేవాసియనగా సమీపమున ఉన్నవాడు. రెండవది దగ్గరివాడు. ఒకటి శారీరకమైనది. రెండవది మానసికమైన స్థితి. సమీపమనగా ఎంత సమీపమున? ఆ ఆచార్య రూపము నుండి వచ్చెడి "తరంగముల" ప్రభావము పొందగలిగినంత సమీపమున. అందువలననే అంతేవాసి బ్రహ్మచారి, గురుకుల వాసి, సంతతాచార్యానువర్తి. అంతేవాసికి రెంచవ యర్థము దగ్గరవాడని కదా! దగ్గర నున్నవాడు కాదు. మానసికముగా దగ్గర అయిన వాడు. మూడు లోకములలో ఆచార్య రూపమెచటనున్నను, మనస్సుచేత దగ్గరజేరి, జ్ఞానసముపార్జనము సాధింపవచ్చునని భావము. ఏకలవ్య శిష్యత్వము సాధ్యమని వేదవచనము. ఆధ్యాత్మ లోకమున మనస్సును అంతర్నిష్ఠితుడైన పరమేశ్వరునకు దగ్గరజేసినచో, అచ్చటనుండి వెలివడు జ్ఞానతరంగము పొందవచ్చునని భావము. తాపసులిట్టి అంతేవాసులు. వేదము విశ్వగతాఖిలజ్ఞాన, విజ్ఞానదాయకమైన గ్రంథమగుటజేసి, అన్ని లోకములందును, అన్ని కాలములందును, అన్ని ప్రదేశములందును, సత్యమై, సాధ్యమైన విషయములనే చెప్పును. అట్టి భిన్న-దేశ-కాల-పరిస్థితుల కనుకూలమైన, భిన్నార్థ పరిపుష్టి కలిగిన శబ్దములనే వాడును. "అంతేవాసి" అట్టి శబ్దము. ప్రవచనమునకు వేదమని కూడ అర్థమున్నది. ఆధ్యాత్మిక, అధిభౌతిక, అధిజ్యోతిష విభాగకలితమైన ఈ బ్రహ్మాండ స్వరూప జ్ఞానమును సంధానించు శబ్దము, ప్రవచనము, వేదము. అందువలననే వేదము శ్రుతి. పూర్వము "విని" నది. ఇప్పుడు "విని" తీరవలసినది. ముందు "విన" వలసినది.

ఈ అనంతమైన విశ్వము, విశ్వకర్త, ఆచార్యరూపము. మనమంతే వాసులము. ఈ విశ్వజ్ఞానము సంధి. ప్రవచనమైన వేదమా జ్ఞానసంధానము.

"ఆచార్యః పూర్వ రూపమ్
అంతేవాస్యుత్తర రూపమ్
విద్యా సంధిః
ప్రవచనగ్ం సంధానమ్"